క్లుప్తంగా

బోర్ల ఏర్పాటుకు శంకుస్థాపన



పెద్దకర్రివానిపాలెంలో బోరుబావి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

కవిటి: మత్స్యకార గ్రామాల్లో మంచినీటి సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని సర్పంచ్ ఎస్‌పీ నారాయణస్వామి, వైస్ ఎంపీపీ కర్రి గోపయ్య అన్నారు. పెద్దకర్రివానిపాలెం, బెజ్జిపుట్టుగ గ్రామాల్లో పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.2.5 లక్షల నిధులతో ఏర్పాటు చేయనున్న బోరుబావుల పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు నీటిని సరఫరా చేస్తామన్నారు.

మాజీ సైనికుల సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా మన్మథరావు



మన్మథరావును సన్మానిస్తున్న మాజీ సైనికులు

పలాస: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా పలాసకు చెందిన ఇళ్ల మన్మథరావు ఎన్నికయ్యారు. విజయవాడలో బాధ్యతలు చేపట్టిన ఆయన సోమవారం పలాస వచ్చిన సందర్భంగా కాశీబుగ్గ మాజీ సైనికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు సత్కరించారు. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా ఒకటే రాష్ట్రం ఒకటే అసోసియేషన్ నినాదంతో విజయవాడలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో రాష్ట్ర సంఘానికి ఎన్నికలు జరిగినట్టు మన్మథరావు చెప్పారు.

అకాల వర్షంతో జీడి రైతు ఆందోళన



వర్షానికి మాడిపోయిన జీడి పూత

వజ్రపుకొత్తూరు: జీడి రైతులు అకాల వర్షంతో ఆందోళన చెందుతున్నారు. ఆదివారం రాత్రి మండలంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం పడింది. ఇప్పటికే పూత వచ్చినప్పటికీ పిక్కల దిగుబడి తగ్గడంతో ఆందోళన చెందుతున్న జీడి రైతులు ఈ వర్షంతో మరింత నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షానికి పూత, పిందె నల్లబారిపోయి రాలిపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

యంగ్ ఇండియా ఉపన్యాసంలో ఆజాద్ ప్రతిభ



నగదు పురస్కారాన్ని అందుకుంటున్న చంద్రశేఖర్ ఆజాద్

టెక్కలి: పాట్నాలో ఇటీవల జాతీయ యువజన కాంగ్రెస్ నిర్వహించిన యంగ్ ఇండియా కే బోల్ సీజన్-5 ఉపన్యాస పోటీల్లో టెక్కలికి చెందిన పేడాడ చంద్రశేఖర్ ఆజాద్ ప్రథమ స్థానంలో నిలిచి నగదు పురస్కారాన్ని అందుకున్నారు. మూడు రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా మొదటి స్థానంలో నిలిచి రూ.50 వేలు నగదుతో పాటు ప్రశంసా పత్రాన్ని దక్కించుకున్నారు. చంద్రశేఖర్ ఆజాద్‌ను పలువురు అభినందించారు.

డ్రగ్స్ వినియోగంతో భవిష్యత్ అంధకారం



పోస్టర్ ప్రజెంటేషన్ చేస్తున్న విద్యార్థులు

టెక్కలి: డ్రగ్స్ బారిన పడే యువత భవిష్యత్ అంధకారంగా మారుతుందని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ అన్నారు. డ్రగ్స్ వినియోగం వలన కలిగే నష్టంపై కళాశాలలో ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో పోస్టర్ ప్రజెంటేషన్ సోమవారం నిర్వహించారు. డ్రగ్స్ వినియోగం వల్ల సంభవించే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతినిధులు బి.సతీష్‌కుమార్, ల్యూక్‌పాల్, బి.ఝాన్సీరాణి పాల్గొన్నారు.

ఎన్‌పీఎస్ఎస్ యాప్‌ను వినియోగించుకోవాలి

ఇచ్ఛాపురం రూరల్: పంటను చీడపీడల నుంచి రక్షించుకోవాడానికి కేంద్ర వ్యవసాయశాఖ ప్రవేశపెట్టిన నేషనల్ పెస్ట్ సర్విలెన్స్ సిస్టమ్ (ఎన్‌పీఎస్ఎస్ ఏఐ ఆధారిత మొబైల్ యాప్‌ను రైతులు సద్వినియోగపరుచుకోవాలని వ్యవసాయాధికారి టి.భార్గవి అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. పంటలకు వివిధ రకాల తెగుళ్లు, వ్యాధులు నష్టం కలిగిస్తుంటాయన్నారు. ఈ నేపథ్యంలో చీడపీడల బారిన పడిన పంటను రైతులు తమ ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా ఫొటో తీసి ఎన్‌పీఎస్ఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేసిన వెంటనే సీనియర్ శాస్త్రవేత్తల సలహాలతో తెగుళ్లు గుర్తించి సమగ్ర సస్య రక్షణ చర్యలు సూచిస్తుందని వివరించారు.

సరిహద్దు గ్రామాలు..

సారా తయారీ కేంద్రాలు!

- నవోదయం 2.0 పేరుతో నియంత్రణకు ఎక్సైజ్ అధికారులు కృషి
- దాడులు చేస్తున్నా ఆగని అమ్మకాలు

ఇచ్ఛాపురం రూరల్:

సారా రహిత గ్రామాలు మన స్వర్ణాంధ్రకు సోపానాలు నినాదంతో కూటమి ప్రభుత్వం చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమం ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పక్కాగా అమలవుతుందా అనే సందేహం వ్యక్తమవుతుంది. నాటు సారా తయారు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం, ప్రత్యామ్నాయ ఉపాధి, అవగాహన సదస్సులు నిర్వహించడం ద్వారా సారా నిరోధానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. అయితే ఆ ప్రయత్నం ఎంత వరకూ సత్ఫలితాలు ఇస్తోందో వేచి చూడాలి.

సరిహద్దు గ్రామాల్లో విచ్చలవిడిగా నాటుసారా

ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామాల్లో నాటుసారా విక్రయాలు, తయారీ జోరుగా జరుగుతున్నాయి. ఇచ్ఛాపురం మండలంలోని కేదారిపురం, ముచ్చింద్ర గ్రామాలకు సమీపంలో ఒడిశా గ్రామాలు అధికంగా ఉన్నాయి. మండపల్లి, ముశ్లభద్ర గ్రామాల పక్కనే ఉన్న దేవులమద్రిలో నాటుసారా అమ్ముతుంటారు. లొద్దపుట్టి, జగన్నాథపురం గ్రామాలకు కిలోమీటరు దూరంలో సారా తయారీ కేంద్రం ఉంది. అలాగే కొళిగాం, బొడ్డబడ గ్రామాల పక్కనే ఒడిశాలోని భీమ్‌పురం గ్రామం ఉంది. ఇచ్ఛాపురం మండలంలోని శాసనాం, అరకబద్ర, ఏ.బలరాంపురం, పెద్ద లక్ష్మీపురం గ్రామాల పక్కనే ఒడిశా గ్రామాలు ఉన్నాయి. దీంతో అక్కడ తయారు చేస్తున్న సారా ఇచ్ఛాపురం మండలంలోకి కొంతమంది తెచ్చి విక్రయిస్తున్నారు. కవిటి మండలానికి సంబంధించి కొజ్జిరియా, కమలాయిపుట్టుగ, కరాపాడు, గొర్లెపాడు, బెలగాం ఆర్‌ఎస్, కంచిలి మండలం ముండలా, కుమ్మరి నోగాం, జె.బైరిపురం, జలంత్రకోట వంటి గ్రామాలకు పక్కనే ఒడిశా గ్రామాలు ఉండటంతో రాత్రి సమయాల్లో నాటుసారా బస్తాలు, బూరలు ద్వారా యథేచ్ఛగా రవాణా అవుతోంది. ఉద్దానం ప్రాంతాల్లో వ్యాపారులు కొబ్బరి తోటల్లో నిల్వలు చేసి అమ్మకాలు చేపడుతున్నారు. ఎక్సైజ్ అధికారులు ఎప్పటికప్పుడు దాడులు చేస్తున్నప్పటికీ వ్యాపారులు మాత్రం వెనుకడుగు వేయకుండా తమ పనులు చక్కబెడుతున్నారు. యథేచ్ఛగా సారా విక్రయాలు, తయారీ జరుగుతోంది.



నవోదయం 2.0 కార్యక్రమంపై ర్యాలీ నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు

విస్తృతంగా అవగాహన సదస్సులు



వాహనం ద్వారా గ్రామాల్లో సారాకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

యథేచ్ఛగా జరుగుతున్న సారాను అరికట్టేందుకు అబ్కారీ శాఖ అధికారులు కృషి చేస్తున్నారు. నాటుసారా ప్రభావిత గ్రామాల్లో నవోదయం 2.0 పేరుతో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. సారా తయారు చేయటం, అమ్మడం, రవాణా చేయటం, నిల్వ ఉంచడం తీవ్రమైన నేరంగా పరిగణించి తీసుకునే చర్యలను వివరించి హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఎనిమిదేళ్ల జైలు శిక్ష, రూ.5 లక్షల వరకు జరిమానా పడుతుందంటూ ఆయా చట్టాలను వివరిస్తున్నారు. సారాకు సంబంధించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన 14405 టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారం ఇవ్వాలంటూ అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. నాటుసారా లేని పల్లెలుగా ఉంచేందుకు ఎక్సైజ్ శాఖతో పాటు గ్రామ పంచాయతీ, గ్రామ సచివాలయం, అటవీశాఖ, యూత్, ఉమెన్ వెల్ఫేర్‌కు సంబంధించి కొంత మంది భాగస్వామ్యంతో కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. ఇన్ని చేస్తున్నా సారా విక్రయాలు ఆగడం లేదనే చెప్పాలి. ఒడిశా సరిహద్దు గ్రామాల నుంచి అధికంగా సారా నియోజకవర్గంలోకి రావడమే దీనికి కారణంగా మారింది.

అవగాహన కల్పిస్తున్నాం



నాటుసారా వలన కలిగే దుష్ప్రభావాలను తెలిపేందుకు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామ స్థాయిలో సదస్సులు నిర్వహిస్తున్నాము. ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా, దాడులు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నాం. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం. అందుకు అధికారులు, యువజన సంఘాల సభ్యుల భాగస్వామ్యం తీసుకుంటున్నాము.

– పీడీ.ప్రసాద్, సీఐ, ఎక్సైజ్ శాఖ, ఇచ్ఛాపురం

భూ సమస్యను పరిష్కరించాలని వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

సోంపేట: భూ సమస్యలు పరిష్కరించాలని సోంపేట మేజర్ పంచాయతీ జలంత్ర జాలారి వీధి రెవెన్యూ పరిధిలోని మహదేవిపేట, సూర్యవాసవీధి, పట్టుశాలి వీధి, జలంతర జాలారివీధులకు చెందిన పలువురు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ బి.అప్పలస్వామి, పంచాయతీ ఈవో శాంతికుమారిలకు సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. నాలుగు వీధుల్లో అనేక సంవత్సరాలుగా నివసిస్తున్నప్పటికీ పోరంబోకు స్థలంగా ప్రభుత్వ రికార్డుల్లో చూపించడం దారుణమన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. తహసీల్దార్ స్పందిస్తూ నెలరోజుల్లో సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో గోవిందరాజులు, నవీన్ ఉన్నారు.

క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ మౌనిక

పలాస: ప్రజలను పట్టిపీడిస్తున్న క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రజలంతా సహకరించాలని రెంటికోట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్.మౌనిక అన్నారు. ఈ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జాతీయ క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని పీహెచ్‌సీలో సోమవారం నిర్వహించి అవగాహన ర్యాలీ చేశారు. క్షయవ్యాధికి వైద్యపరీక్షలు పూర్తిగా ఉచితమని చెప్పారు. ఫార్మసీ అధికారి బోనెల గోపాల్, సీహెచ్‌వో బి.ఆదేమ్మ, యూడీసీ సుదర్శన్, స్టాఫ్ నర్స్ విమలాదేవి, హెల్త్ సూపరువైజర్ సీహెచ్ ఈశ్వరమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ త్రివేణి, ఎంఎస్‌వో కిశోర్ ఉన్నారు.

కొనసాగుతున్న బెంతొరియాల రిలే దీక్షలు



శిబిరంలో కూర్చున్న బెంతొరియా ప్రతినిధులు

కవిటి: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ బెంతొరియాలు మండల కేంద్రం కమిటిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 453వ రోజుకు చేరాయి. తమ కులానికి రిజర్వేషన్ కల్పనకు సంబంధించిన అంశంలో ఉదాసీన వైఖరి విడనాడి న్యాయం చేయకుంటే ప్రభుత్వంపై ప్రజా ఉద్యమం చేస్తామని బెంతొరియా సంఘం ప్రతినిధులు ఈ సందర్భంగా అన్నారు. సంఘం నేతలు సుమన్‌బిసాయి, బృందావన్, జగన్నాథ్, కాశీసాహూ పాల్గొన్నారు.

మెప్మా సిబ్బందికి అభినందనలు



గిన్నీస్‌బుక్ సర్టిఫికెట్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిరీష

కాశీబుగ్గ: మెప్మా డిపార్ట్‌మెంట్ వరల్డ్ రికార్డులు సాధించడంతో పాటు పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన ఇద్దరు ఆర్‌పీలకు రాష్ట్రస్థాయిలో అవార్డులు వచ్చాయి. దీంతో వారిని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష శనివారం అభినందించారు. మహిళలు తయారీ చేసిన ఉత్పత్తులు ఆన్‌లైన్‌లో అర్డర్ చేసి సకాలంలో లబ్ధిదారులకు అందజేసినందుకు రాష్ట్ర మెప్మాకు గిన్నిస్ బుక్ రికార్డ్ దక్కింది. అందులో భాగస్వామ్యమైన పలాస మెప్మాకు సర్టిఫికెట్‌లు అందాయి. అలాగే రాష్ట్రస్థాయి అవార్డు పొందిన ఇద్దరు ఆర్పిలను ఎమ్మెల్యే అభినందించారు. మెప్మా పట్టణ అధ్యక్షురాలు రాజలక్ష్మి, సిటీ మిషన్ మేనేజర్ పి.మోహన్‌రావు, సీవో బాలరాజు, బోర విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల ఘర్షణ!

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన ఇద్దరు టీడీపీ నాయకులు ఇన్‌చార్జి పదవి విషయంలో గొడవ పడ్డారు. 18వ వార్డులో సోమవారం రోడ్డు శంకుస్థాపన జరగ్గా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష హాజరై భూమి పూజలు చేశారు. అనంతరం ఆమె అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ తరువాత మాజీ కౌన్సిలర్, కౌన్సిలర్‌గా పోటీ చేసి ఓడిపోయిన ఇద్దరు టీడీపీ నాయకులు పార్టీ పట్టణ ఇన్‌చార్జి పదవి విషయంలో పరస్పరం గొడవకుదిగి తోసుకున్నట్టు పట్టణంలో ప్రచారం జరిగింది. ప్రముఖ నాయకుడు కుమారుడు ఛాతిపై మరో నాయకుడు చేయి వేసేసినట్టు ప్రచారం జరుగుతుంది. దీన్ని చూసి అక్కడ ఉన్న కూటమి పార్టీల శ్రేణులు ఆశ్చర్యపోయారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శిరీష ఇద్దరు నాయకులకు ఫోన్ చేసి సర్దిచెప్పినట్టు తెలిసింది.

సంక్షిప్తంగా...

ఆర్వోబీల మంజూరు

కంచిలి: ఈస్టు కోస్టు రైల్వే జోన్ పరిధి ఇచ్ఛాపురం నుంచి పలాస రైల్వేస్టేషన్ల మధ్యలో ఉన్న 12 ఎల్‌సీ గేట్లు వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ)లు మంజూరైనట్లు జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు శ్రీనివాసరావో తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వీటి నిర్మాణం పూర్తయితే రద్దీగా ఉండే రత్తకన్న, అంపురం, గొల్లకంచిలి, బారువ రైల్వే క్రాసింగ్‌ల వద్ద ప్రయాణికుల కష్టాలు తీరుతాయన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

ఇచ్ఛాపురం టౌన్: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని 22వార్డు కౌన్సిలర్ కె.దిల్లీప్, 21 వార్డు నాయకుడు కె.జయదేవ్ అన్నారు. ఈ వార్డు సచివాలయాల్లో సంక్షేమ పథకాలపై మహిళలకు అవగాహన కల్పించారు. సచివాలయ సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

నేడు ఆశీల వసూళ్లకు వేలం నిర్వహణ

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి దినవారిబజారు, వీధిగుత్తలు, కమేళాలు, కొబ్బరి ఫలసాయం, లైబ్రరీలకు సంబంధించి ఆశీల వసూళ్ల కోసం మంగళవారం బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎస్.రమేష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న వేలం పాటకు ఆసక్తి ఉన్నవారు హాజరు కావాలని కోరారు.

వ్యక్తికి గాయాలు

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం చలమయ్యపేట గ్రామ సమీప జాతీయ రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఢీకున్న ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. శ్రీకాకుళం నుంచి టెక్కలి వైపు షణ్ముఖరావు అనే వ్యక్తి వస్తుండగా చలమయ్యపేట గ్రామానికి చెందిన రామకృష్ణ ద్విచక్ర వాహనంతో డివైడర్‌ను దాటుతున్న క్రమంలో ఢీకొట్టుకోవడంతో చోటుచేసుకుంది. షణ్ముఖరావు తీవ్రంగా గాయపడడంతో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. కోటబొమ్మాళి పోలీసులకు సమాచారం అందించారు.

మౌలిక వసతులు కల్పించండి



వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి: టెక్కలి సైనిక్‌నగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని బీజేపీ కార్యకర్తలతో పాటు కాలనీవాసులు కోరారు. ఈ మేరకు టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తిని సోమవారం కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ వారం 13 వినతులను స్వీకరించారు. వీటిని పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆర్డీవో సూచించారు.

నేడు స్వేచ్ఛావతి అమ్మవారి ఆరో వార్షికోత్సవం

ఇచ్ఛాపురం టౌన్: ఇచ్ఛాపురం గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి కృష్ణ శిలావిగ్రహ ప్రతిష్ఠ ఆరో వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, హోమ పూజలు ఉంటాయన్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

కొత్తమ్మతల్లి హుండీ ఆదాయం రూ.3,63,923

టెక్కలి: కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి దేవస్థానం హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. దేవదాయ ధర్మాదాయ శాఖాధికారి టి.రవి, స్థానిక కార్య నిర్వాహణాధికారి వి.రాధాకృష్ణ పర్యవేక్షణలో హుండీలను తెరిచి లెక్కించారు. 60 రోజులకు రూ.3,63,923 ఆదాయంతో పాటు 185 గ్రాముల బంగారం, వెండి 2.615 కిలోలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. లెక్కింపు ప్రక్రియలో గ్రామ పెద్ద బి.గోవిందరాజులు ఉన్నారు.

స్థలాల కేటాయింపునకు 26న లాటరీ

కాశీబుగ్గ: పలాస మండలం బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో నిర్మించనున్న ఎంఐజీ లేఅవుట్లలో స్థలాల కేటాయింపునకు ఈనెల 26వ తేదీన లాటరీ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు సుడా అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాత జాతీయ రహదారిలోని టీకేఆర్ కల్యాణ మండపంలో 26న నిర్వహించనున్నారు. దరఖాస్తు దారులంతా ఆధార్‌కార్డు, ఎంఐజీ ఫ్లాట్ దరఖాస్తు, ఉద్యోగి ఐడీ, పెన్సనర్‌లైతే పెన్సన్ ఐడీ, పాస్‌ఫొటోలతో 200, 150 గజాలకు చెందిన అన్ని విభాగాల వారు హాజరు కావాలన్నారు.

శ్రీరామ దీక్షా మాలధారణ



భజన కార్యక్రమంలో శ్రీరామ దీక్షాపరులు

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురంలో సీతారాముల ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా స్థానిక భక్తులు సోమవారం శ్రీరామ దీక్షా మాలధారణ చేపట్టారు. గురుస్వామి నీలగిరి రామకృష్ణ సిద్ధాంతి ఆధ్వర్యంలో మాలధారణ చేసి విశ్వక్షేణారాధన పుణ్యాహవచనం తదితర పూజలు చేశారు.

టీటీడీ ఆస్థాన గాయకులకు నృత్య స్వరాంజలి



బాలకృష్ణ ప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: తిరుమల తిరుపతి దేవస్థాన ఆస్థాన గాయకులు, అపర అన్నమయ్యగా పేరుగాంచిన దివంగత గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్‌కి స్థానిక శ్రీవెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ చిన్నారులు, వెంకటేశ్వర భక్తి రంజని కళాకారులు సోమవారం నృత్య స్వరాంజలి ఘటించారు. వెంకటేశ్వర డాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమి, చిదంబరేశ్వరాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో బాలకృష్ణ ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాయకులు స్వరనీరాజనం, నాట్యకారులు నృత్యనీరాజనం ఘటించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు, చిన్నాగురుస్వామి, అనపాన మణి, హైమావతి, గుణవతి,దేవ, మణికంఠపాల్గొన్నారు.

'ఉపాధి' కల్పించండి



పనులు కల్పించాలని నినాదాలు చేస్తున్న వేతనదారులు

నందిగాం: వ్యవసాయ పనులు ముగిసిన నేపథ్యంలో గ్రామాల్లో ఉపాధిహామీ పనులు వేతనదారులకు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి పాలిన సాంబమూర్తి కోరారు. సోమవారం ప్రతాపవిశ్వనాథపురం పంచాయతీ చెరుకుపల్లిలో వేతనదారులను కలిసి మాట్లాడారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో జాబ్ కార్డు ఉన్నవారికి 200 పనిదినాలు కల్పించాలన్నారు. నందిగాం పంచాయతీలో ఉపాధి హామీ పథకం మేట్‌లను మార్చడం వలన వేతనదారులు ఉపాధి కోల్పోతున్నారని వేతనదారులు అంబోడి సురేష్ తదితరులు చెప్పారు. పనులు కల్పించాలని వేతనదారులు నినాదాలు చేశారు.

సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి



సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: నగరంపల్లిలో నెలకొన్న స్థానిక సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక గ్రామ సచివాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. అనంతరం సీపీఎం నాయకులు బి.ఆనందరావు మాట్లాడుతూ.. నగరపల్లి పంచాయతీలో నెలకున్న నీటి సమస్యను పరిష్కరించాలని, రోడ్డు సౌకర్యం కల్పించాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌కు సమ్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. సీపీఎం నాయకులు బి.సుగుణ, ఎన్.చంద్రయ్య, బైరాగి, బి.రామక్రిష్ణ, మోహనరావు ఉన్నారు.

ఆక్రమణలు ఉపేక్షించేది లేదు



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

టెక్కలి: ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలను ఉపేక్షించేది లేదని ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్.రవికుమార్ హెచ్చరించారు. టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి మండాపాలం కాలనీలో ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్న విషయాన్ని తెలుసుకుని ఆయా కట్టడాలను నిలిపివేసి హెచ్చరిక బోర్డులను సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేయడం, అక్రమ నిర్మాణాలు చేయడం చేస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

కాలువలో పడిన ఆవుదూడ..

- కాపాడిన పాదచారులు



రక్షించిన ఆవుదూడతో గో-సంరక్షకులు


కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి కేటీరోడ్డులోని కాలువలో ఆదివారం అర్ధరాత్రి ఆవు దూడ పడిపోయింది. అయితే బయటకు రాలేక రాత్రంతా కొట్టుమిట్టాడింది. సోమవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన పాదచారులు గుర్తించి కాలువ నుంచి బయటకు తీశారు. అయితే దూడకు కుడికాలు విరిగిపోవడంతో గో–సంరక్షకులకు సమాచారం ఇచ్చారు. గోపాలమిత్ర అవుగాన బాలక్రిష్ణ దూడకు చికిత్స చేయగా.. గో–సంరక్షకులు లక్కోజు ధర్మారావు, సందీప్ రెడ్డి, బాబా, బాలక్రిష్ణ, హనుమంతు మురళి, గొంటు అప్పారావు, రమేష్ బెహరా సహకరించారు.

పురస్కారం ప్రదానం



పలాస మండలం మాకన్నపల్లి గ్రామానికి చెందిన ప్రజా రచయత, కవి కుత్తుం వినోద్‌కు ఉత్తమ కవితా పురస్కారం వరించింది. ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు రాష్ట్రాల స్థాయిలో కవి సంధ్య, యానం చిన్ననారాయణ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయంలో ఆదివారం జరిగిన కవిత పోటీల్లో నగదు బహుమతితోపాటు కవితా పురస్కారాన్ని ప్రముఖ కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య ఎన్.గోపి అందజేశారు. ఉద్దానం ప్రాంత కవులు, రచయతులు అభినందనలు తెలియజేశారు. -పలాస

అంధకారంలో ఆస్పత్రి రోడ్డు..



టెక్కలిలోని జిల్లా ఆస్పత్రికి వెళ్లేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన రోడ్డు అంధకారాన్ని తలపిస్తుంది. కొద్దిరోజుల క్రితం రెండు వైపుల నుంచి ఆస్పత్రికి వెళ్లేందుకు మార్గం ఉండేది. దీంతో రాత్రి సమయంలో లైటింగ్ ఉన్న ఓపీ మార్గం ద్వారా ప్రజలు, రోగులు ఆస్పత్రికి వెళ్లి వచ్చేవారు. అయితే ఇటీవల ఓపీ మార్గం వద్ద ఉన్న గేటును అధికారులు మూసివేయడంతో కొత్తగా వేసిన రహదారి నుంచి వెళ్లవలసి వస్తుంది. ఈ మార్గంలో ఇంకా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయకపోవడంతో సాయంత్రమైతే అంధకారం నెలకుంటుంది. దీంతో ఆస్పత్రికి సెల్‌ఫోన్ లేదా టార్చ్ లైట్లు వేసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకుంది. -టెక్కలి రూరల్

ఆకట్టుకున్న రైతు బిడ్డ నృత్య రూపకం



పోలవరం గ్రామంలో పాశి పోలమ్మ సిరిమానోత్సవంలో భాగంగా సోమవారం గ్రామంలో యువకులు వేసిన రైతు బిడ్డ నృత్య రూపకం ఆకట్టుకుంది. యువకులంతా రైతులు, మహిళా రైతుల వేషధారణలతో సహజత్వం ఉట్టి పడే విధంగా గ్రామీణ నృత్యాలతో ప్రత్యేకంగా ఆకట్టుకున్నారు. వీటిని చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపారు. -టెక్కలి